ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 14 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

# 'నిన్ను ఇంట్లోనే చంపుతాం'...

**బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు మరోసారి బెదిరింపులు**

**ముంబయిలోని వర్లి రవాణా శాఖ వాట్సాప్ నంబర్‌కు సందేశం**

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

ముంబయి : బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి తీవ్ర బెదిరింపులు వచ్చాయి. "సల్మాన్... నిన్ను ఇంట్లోనే చంపుతాం. లేదా నీ కారుని బాంబు పెట్టి పేల్చేస్తాం" అని ముంబయిలోని వర్లి రవాణా శాఖ వాట్సాప్ నంబర్ కు సందేశం వచ్చింది. దాంతో వర్లి పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు ఈ మేసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది, సీరియస్ వార్నింగా లేక కావాలని ఎవరైనా సందేశం పంపించారా అనే విషయాన్ని తేల్చేపనిలో వర్లి పోలీసులు ఉన్నారు. గతంలోనూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చంపుతామంటూ పలుమార్లు బెదిరించడం తెలిసిందే.



# పార్క్ హయత్ హోటల్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులో మంటలు చెలరేగి.. దట్టంగా పొగలు అలముకున్నాయి. వెంట నే హోటల్ సిబ్బంది వెంటనే ఫైరింజన్ కు ఫోన్ చేశారు. హుటాహుటిన సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.




# మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిపై కేసు

**అరుంధతి హాస్పిటల్‌కు సిబ్బంది సమకూర్పు ఒప్పందం**

**ఉల్లంఘించారంటూ యేసుబాబు అనే వ్యక్తి ఫిర్యాదు**

హైదరాబాద్ : మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, ప్రస్తుత మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై చీటింగ్ కేసు నమోదైంది. యేసుబాబు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదయ్యింది. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. యేసుబాబు ఫిర్యాదు ప్రకారం "విజన్ ప్రాపర్టీ మేనేజ్మెంట్ సర్వీస్" సంస్థ ద్వారా ఆయన అరుంధతి హాస్పిటల్‌కు సిబ్బంది సమకూర్చినట్లు పేర్కొన్నారు. మొత్తం 40 మంది సిబ్బందిని అందించగా.. అందుకు గాను రూ.50 లక్షలు చెల్లిస్తామని రాజశేఖర్ రెడ్డి ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు పలు దఫాల్లో కేవలం రూ.30 లక్షలే చెల్లించారని, మిగిలిన డబ్బుల కోసం పలుమార్లు అడిగినా స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అతను పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మర్రి రాజశేఖర్ రెడ్డిపై బీఎన్ఎస్ చట్టం కింద చీటింగ్ కేసు నమోదు చేశారు. పీఎస్‌లో కేసు నంబర్ 316/2, 318(4) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది.



# ఇది కాంగ్రెస్ పెట్టిన శరగోపం

**కాలం పెట్టిన శాపం కాదు**

**"సాగునీరు లేక పొలాలు ఎండుతున్నాయి..**

**తాగునీరు లేక గొంతులు తడారుతున్నాయి.**

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్ : కాంగ్రెస్ అంటే కరవు.. కరవు అంటే కాంగ్రెస్ అని మాజీ మంత్రి , బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కేటీఆర్ ఎద్దేవా చేశారు. మా పార్టీపై కక్షతో కాళేశ్వరం పంపులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "సాగునీరు లేక పొలాలు ఎండుతున్నాయి.. తాగునీరు లేక గొంతులు తడారుతున్నాయి. నిర్లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పక్కన పెట్టారు. పక్కన కృష్ణమ్మ ఉన్నా ఫలితమేమీ లేకపాయె. ఇది కాలం పెట్టిన శాపం కాదు.. తెలంగాణకు కాంగ్రెస్ పెట్టిన శరగోపం. జాగో తెలంగాణ.. జాగో" అని కేటీఆర్ పేర్కొన్నారు.





# తాప్సీది గొప్ప మనసు

సినిమా : ఎండ దంచికొడుతోంది. దాని నుంచి ఉపశమనం పొందాలంటే నీడ పట్టునో లేదా ఏసీ, కూలర్ కావాలి. అయితే ఇవి సమకూర్చుకోలేని వారి పరిస్థితి ఏంటి ? ఎండకు మాగ్గాల్సిందే. అయితే హీరోయిన్ టాప్సీ మాత్రం తన వంతుగా రేకుల ఇళ్లలో ఉంటున్న పలువురికి కూలర్లు, ఫ్యాన్లు అందజేశారు. ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థతో కలిసి ఉదారత చాటారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్స్ తాప్సీ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. అందమైన నటి మాత్రమే కాదు అందమైన మనసున్న మనిషి అంటూ పొగుడుతున్నారు.

హీరోయిన్ తాప్సీ పన్ను.. 'ఝుమ్మంది నాదం' సినిమాతో టాలీవుడ్ హీరోయిన్‌గా పరిచయమై, ఆ తర్వాత తెలుగు, తమిళంలో వరుస చిత్రాల్లో నటించింది. 'వస్తాడు నా రాజు', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ', 'మొగుడు' లాంటి సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. అలాగే తమిళ్‌లో 'కాంచన 2', 'పై రాజా పై', 'గేమ్ ఓవర్ సహా' ఇలా చాలా చిత్రాల్లో నటించింది. తర్వాత బాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చి 'మిషన్ మంగళ్', 'చాంత్ కి ఆంక్', 'తప్పట్', 'హసీన్ దిల్రూబా' వంటి మూవీస్ లో నటించి అక్కడ కూడా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లోనే వరుస సినిమాలు, సిరీస్ లు చేస్తోంది.

# భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు

**సీఎంకు ఎస్సీ వర్గీకరణ జీవో కాపీ**

**ఇవాళ్టి నుంచి అమల్లోకి**

**మంత్రులు ఉత్తమ్, పొన్నం, దామోదర**



హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణ ను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన జీవో విడుదల చేసి మొదటి కాపీని సీఎం రేవంత్‌రెడ్డికి అందించామన్నారు. "ఎస్సీ వర్గీకరణపై గతంలో అసెంబ్లీలో అన్ని పార్టీల వారు మాట్లాడారు. కానీ ఏ పార్టీ కూడా దీన్ని ముందుకు తీసుకెళ్లలేదు. మా ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టాం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక ప్రక్రియను వేగవంతం చేశాం. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాం. కొన్ని వేల విజ్ఞప్తులు వచ్చాయి.. వాటిని ఎంతో అధ్యయనం చేశాం" అని తెలిపారు. ఇవాళ్టి నుంచి ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిందని చెప్పారు. దళితుల్లో సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. "ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. కొన్నివేల విజ్ఞప్తులు అందుకుని అధ్యయనం చేశాం. విద్య, ఉద్యోగాల్లో ఇకపై ఇచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అమలవుతుంది. ఇవాళ్టి నుంచి భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నాం"అని రాజనర్సింహ తెలిపారు.

# 15న కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం

హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నారు. శంషాబాద్‌లోని నోవాటెల్ లో ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సీఎల్పీ సమావేశం జరగనుంది. ఇందులో నాలుగు అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. భూ భారతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీఎస్టీ వర్గీకరణపై చర్చ ఉండనుంది. ఈమేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వ విప్‌లు సమాచారమిచ్చారు.

